క్లుప్తంగా

ఇందుపల్లి పూర్వ విద్యార్థికి ఐఐటీ మెయిన్స్‌లో 19వ ర్యాంక్



ఉంగుటూరు: ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థి తూము వైష్ణవ్ ఐఐటీ మెయిన్స్ జాతీయ స్థాయిలో ఎస్సీ విభాగంలో 19వ ర్యాంక్ సాధించినట్లు హెచ్‌ఎం టి.సీతారామ్ తెలిపారు. స్థానిక విలేకరులతో హెచ్‌ఎం సోమవారం మాట్లాడుతూ.. విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు పాఠశాలకు తెలుగు పండిట్‌గా 10 ఏళ్ల సేవలు అందించారన్నారు. విద్యార్థిని విద్యా కమిటీ చైర్‌పర్సన్ మత్తే తరంగిణి, వైస్ చైర్మన్ శ్రీనివాసరావు, సర్పంచ్ బండి వెంకట లక్ష్మి, కెనరా బ్యాంక్ మేనేజర్ దినేష్ ర్యాంక్ అభినందించారు.

టిడ్కో డైరెక్టర్ పదవికి రాజీనామా

పెనమలూరు: ఏపీ టిడ్కో డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు పి.రాఘవరావు తెలిపారు. ఆయన సోమవారం పోరంకిలో మాట్లాడుతూ తమ పార్టీ ఎన్నికల్లో ఓడిపోవటంతో టిడ్కో పదవికి రాజీనామా చేశానన్నారు. రాజీనామా లేఖను టిడ్కో ఎండీకి పంపానని చెప్పారు.

30న ఏకపాత్రాభినయం పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకుని శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం ఆధ్వర్యాన ఈ నెల 30వ తేదీన అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎస్. వెంకటేశ్వర రాజు, డాక్టర్ ఎస్‌వీ సుబ్బరాజు తెలిపారు. ముత్యాలంపాడులోని శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం పోటీల్లో 20 సంవత్సరాలు దాటిన వారు ఎవరైనా పాల్గొనవచ్చని చెప్పారు. ఇందుకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెల 23వ తేదీలోగా ముత్యాలంపాడులోని శ్రీ అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని కోరారు. పోటీ వ్యవధి పదినిమిషాలు ఉంటుందన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ. 10 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ. 7 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 5 వేలు నగదు బహుమతులు అందిస్తామని వెల్లడించారు. పాల్గొన్న వారికి కన్సొలేషన్ బహుమతులు ఇస్తామని వివరించారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు సాంస్కృతిక సంఘం కార్యాలయంలో స్వయంగా కానీ 9440322933 ఫోన్ నంబర్‌లోకానీ సంప్రదించాలని తెలిపారు. సంఘం కార్యదర్శి కాకర్లపూడి ప్రసాదరాజు పాల్గొన్నారు.

అన్నసమారాధన

గుడివాడరూరల్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో శాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం, పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య, నవభారత్ ఖాదీస్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, మాకుల సత్యం, సభ్యులు కంతేటి హరిబాబు, జాజుల తాతారావులు పాల్గొన్నారు.

వడివడిగా వ్యవసాయ పనులు

- దుక్కులు వేగవంతం
- సిద్ధమవుతున్న నారుమడులు
- వరుణుడి పలకరింపుతో వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీ

కంకిపాడు: రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో రైతులు వ్యవసాయ పనుల్లో వడివడిగా నిమగ్నమవుతున్నారు. ఖరీఫ్‌కు పొలాలు అదునుగా ఉండటంతో దుక్కులు వేగం చేశారు. ఇప్పటికే విత్తనాన్ని సేకరించి నారుమడులు పోసుకుంటున్నారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీగా ఉంటున్నారు.

42 వేల ఎకరాల్లో సాగు..

పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో 42 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు అనువైన భూములు ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఆరంభం కావటంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఇప్పటికే పొలాలను దుక్కులు దున్నారు. తొలకరి వానలతో పొలాలు పదునుకు రావటంతో మరో మారు దుక్కి దున్ని, దమ్ము చేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కులతో పాటుగా మరో వైపు బోరు సదుపాయం ఉన్న భూముల్లో ఇప్పటికే నారుమడులు పోసుకున్నారు. వ్యవసాయశాఖ ఆయా ప్రాంతాలకు అనువైన విత్తన రకాలను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచింది. వీటితో పాటుగా బహిరంగ మార్కెట్ నుంచి విత్తనాలను సేకరించి రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ప్రధానంగా ఎంటీయూ, బీపీటీ, కృష్ణవేణి మొదలైన విత్తన రకాలను సాగుకు ఎంపిక చేసుకుంటున్నారు.



పునాదిపాడులో పొలం దుక్కి దున్నుతున్న రైతు



ఆకాశంలో కమ్మేసిన కారుమబ్బులు

వరుణుడి పలకరింపు..

రుతుపవనాల ప్రవేశంతో తొలకరి పలకరించింది. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు వచ్చాయి. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై అడపా దడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది. సోమవారం కూడా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మోస్తరు వర్షం పడింది. అడపాదడపా పడుతున్న వానలతో రైతన్నలు సాగుకు అన్ని విధాలా సంసిద్ధం అవుతున్నారు. గట్టు సరిచేయటం, వ్యర్థాలు ఏరి నారుమడులు సిద్ధం చేయటం, దమ్ములకు భూమి తయారు చేసే పనిలో అన్నదాతలు, కూలీలు బిజీగా ఉంటున్నారు.

నోరూరించే లిచీ..



వర్షాకాలంలో నోరూరించే లిచీ ఫ్రూట్ విక్రయాలు నగరంలో జోరుగా సాగుతున్నాయి. ఎర్రటి రంగులో ఉండే ఈ పండ్లను తోపుడు బండ్లపై పెట్టి విక్రయిస్తున్నారు. బందరు రోడ్డులో ఓ బండిపై పెట్టిన పండ్లను నగరవాసులు ఎంతో ఆసక్తిగా కొనుగోలు చేస్తున్న చిత్రమిది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఇదే నా గూడు...



గుణదల శివారు ప్రాంతంలోని ఓ చెట్టు తొర్రలో గూడు ఏర్పాటు చేసుకున్న గుడ్ల గూబ.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి

కంకిపాడు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానించిన దోషులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. కంకిపాడులోని సంఘ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన సంఘటనపై సోమవారం నిరసన తెలిపారు. గోగులమూడి రాజు మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం ఎర్రపోతవరం లాకులు వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి గుర్తుతెలియని దుండగులు అసభ్యంగా దూషిస్తూ లేఖ రాసి, చెప్పులు దండ వేయటాన్ని తీవ్రంగా ఖండించారు. రాజకీయ పార్టీల ముసుగులో రాజ్యాంగ నిర్మాతనే అవమానిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి, మాలలను దూషిస్తూ లేఖ రాసిన నిందితులను త్వరితగతిన అరెస్ట్ చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి గంజి రాజ్‌కుమార్, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల అధ్యక్షులు సరిహద్దు ఆంటోని, పి.రామకృష్ణ, నాయకులు రాపల్లి విల్సన్, మారుమూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కంకిపాడులో మాట్లాడుతున్న మాలమహానాడు సంఘం నాయకులు

మెగా డీఎస్సీ ప్రకటించాలి

తిరువూరు: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మెగా డీఎస్సీ నిర్వహణకు కార్యాచరణ చేపట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు కోరారు. తిరువూరు సుంకర వీరభద్రరావు భవన్‌లో సోమవారం ఏఐవైఎఫ్ కార్యకర్తల సమావేశం జరిగింది. మెగా డీఎస్సీ నిర్వహణ ఫైలుపైనే తొలి సంతకం చేస్తానన్న చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకుని ఉపాధ్యాయ పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మురళి, మోహన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌తో వేర్వేరు రంగాల్లో అవకాశాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫార్మసీ విద్యార్థులు సిలబస్‌తో పాటు, కొన్ని రకాల వైద్య రంగంలో ఉపయోగపడే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్ నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని ఎడ్యుబోట్ అధినేత పాలడుగు శశాంక అన్నారు. నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఫార్మాస్యూటిక్స్, ఫార్మసీ ప్రాక్టీస్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శశాంక మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు అవసరమైన సాఫ్ట్‌వేర్స్ గురించి విద్యార్థులకు తెలియచేశారు. ప్రతి విద్యార్థీ సిలబస్‌తో పాటు, అదనపు కోర్సుల్లో శిక్షణ చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత మాట్లాడుతూ బి.ఫార్మసీ, ఫార్మా డి విద్యార్థులు హెల్త్ ఇన్ఫార్మెటిక్స్ రంగంలో దేశవిదేశాల్లో ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

తాడిగడపలో ట్రాఫిక్ అవుట్ పోస్ట్ నిర్మాణం

పెనమలూరు: మండల పరిధిలో ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌కు కొత్తగా భవనం నిర్మించారు. కృష్ణా జిల్లా విడిపోయిన తరువాత పెనమలూరు మండలం విజయవాడ పోలీస్ కమిషనరేట్ నుంచి జిల్లా ఎస్పీ పరిధిలోకి ట్రాఫిక్ విభాగం మారింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు గన్నవరం సర్కిల్‌కు పరిధిలో ఉన్నారు. మండల పరిధిలో విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారి ఆటోనగర్ టెర్మినల్ నుంచి గోసాల వరకు విస్తరించి ఉండటంతో విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. దీనికి గాను దాదాపు 18 మంది ట్రాఫిక్ కానిస్టేబుళ్లు పని చేస్తున్నారు. స్థానికంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ లేదు. దీంతో తాడిగడప జంక్షన్ వద్ద చిన్నపాటి ఇనుప క్యాబిన్‌లో ట్రాఫిక్ అవుట్ పోస్టులో సీఐ స్థాయి అధికారి, సిబ్బందితో మండల పరిధిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు.

హోటల్ పుణ్యమా..

కాగా తాడిగడప జంక్షన్‌లో ఉన్న ట్రాఫిక్ అవుట్ పోస్ట్ కొత్తగా నిర్మించిన ఓ హోటల్‌కు అడ్డుగా ఉంది. దీంతో హోటల్ యజమాని ముందుకువచ్చి తాడిగడప జంక్షన్‌లో బందరు కాలువ కట్టపై వసతులతో ట్రాఫిక్ అవుట్ పోస్ట్ నిర్మిస్తానని ముందుకు వచ్చారు. ఇరిగేషన్ అనుమతితో బందరు కాలువ కట్టపై చిన్నపాటి ట్రాఫిక్ అవుట్ పోస్ట్‌ను నిర్మించారు. హోటల్ ఎదురుగా ఉన్న పాత అవుట్ పోస్ట్ తొలగించారు. అయితే కొత్తగా నిర్మించిన అవుట్ పోస్ట్ పనులు చివరి దశకు చేరుకున్నాయి.



తాడిగడప జంక్షన్‌లో నిర్మించిన ట్రాఫిక్ అవుట్ పోస్టు

ఘనంగా కోదండరామయ్య విగ్రహావిష్కరణ

గన్నవరం: గన్నవరం పరిసర ప్రాంతాల్లో విద్యారంగం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వీకేఆర్ కళాశాల వ్యవస్థాపకుడు వేములపల్లి కోదండరామయ్య ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో సోమవారం వేములపల్లి కోదండరామయ్య 110వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోదండరామయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన మేనకోడలు మోటపర్తి రామచంద్రమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. తొలుత జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, కళాశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకట్ మోటపర్తి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం రామచంద్రమ్మ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం జీవితమంతా పాటుపడిన గొప్ప మహోన్నతమైన వ్యక్తిగా కోదండరామయ్యను అభివర్ణించారు. బుద్దవరం, గుడివాడలో కళాశాలలు, నందివాడ, గన్నవరంలో జెడ్పీ హైస్కూల్స్ ఏర్పాటు ద్వారా వేలాది మంది విద్యార్థుల ఉన్నతికి ఆయన తోడ్పాడ్డారని చెప్పారు. ఐదున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన వీఆర్ కళాశాల విద్యార్థినని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నట్లు ఎమ్మెల్యే గద్దె పేర్కొన్నారు. పామర్రు ఎమ్మెల్యేగా ఎన్నికైన వర్ల కుమార్‌రాజా, కళాశాల కార్యదర్శి జీఎల్ఎస్ఎన్ ప్రసాద్, కరస్పాండెంట్ పీవీ రత్నప్రసాద్, కోశాధికారి గూడవల్లి రాధాసుబ్బారావు, మాజీ కార్యదర్శి చింతపల్లి సీతారామయ్య, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కోదండరామయ్య కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న రామచంద్రమ్మ, అతిథులు

మేఘాల మాటున...



ఇబ్రహీంపట్నం విద్యుత్ కేంద్రం నుంచి మేఘాల మాటున కాలుష్యం వెదజల్లుతున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ముమ్మరంగా పంట కాల్వ పనులు

విజయవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పంట కాల్వ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నైరుతీ రుతుపవనాలు రావడంతో చెదురుమదురుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్‌కు సంబంధించిన వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పొలాలు దుక్కులు దున్నడం, నారుమడులు పోసుకోవడం లాంటివి చేస్తున్నారు. వార్షిక ప్రణాళికలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలు నున్న జంగమవాని చెరువు, పుల్లయ్య చెరువు, బూరుగుల చెరువు ఆయకట్టు పరిధిలోని పంట కాల్వల అభివృద్ధి పనులు చేస్తున్నారు. అలాగే పాతపాడు గ్రామంలో సుబ్బన్న చెరువు, ఎర్ర చెరువు, పి.నైనవరం గ్రామంలో గొల్లపూడి పంపింగ్ స్కీమ్ పరిధిలో పొలాల పంటకాల్వ పనుల అభివృద్ధి చేస్తున్నారు. జాబ్ కార్డు కలిగిన కూలీలు రోజుకు 15 మీటర్ల పొడవు, 1 మీటరు వెడల్పు అడుగులోతు తవ్వకం పని చేస్తే రోజుకు 272 రూపాయల నుంచి 300 రూపాయల వరకు వేతనం లభిస్తోంది. రైతులు, కౌలు రైతులు తమ పొలాలకు సాగు నీరు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పంట కాల్వ పనులు చేస్తున్నారు. అయితే ముందుగా గ్రామసభల్లో తీర్మానం చేసిన పొలాల్లో మాత్రమే పంట కాల్వల అభివృద్ధి పనులు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని ఇంజినీర్ కన్సల్‌టెంట్ పి.శ్రీనివాసరావు తెలిపారు.



పంట కాల్వ పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఉంగుటూరు: సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ మేనేజర్ జి.పద్మవల్లి తెలిపారు. తేలప్రోలు ఎస్‌బీఐ వద్ద పలువురు ఖాతాదారులకు సైబర్ మోసాలపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిజిటల్ మోసాలు, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. కేవైసీ అప్‌డేట్, సీవీవీ, పిన్ నంబరు కోసం బ్యాంకు సిబ్బంది ఎవరిని అడగరని చెప్పారు. బ్యాంకు ఖాతాకు సంబంధించిన సమాచారాన్ని ఎవరితో పంచుకోకూడదన్నారు. ఒక వేళ మీరు ఎటువంటి లావాదేవిలు చేయకపోయిన లావాదేవీలు జరిగినట్లు అనుమానం వస్తే తక్షణమే బ్యాంకులో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసోసియేట్ పి.శాంతికిరణ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పద్మవల్లి

● ఆర్యవైశ్య కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, రఘుబాబు

గుడివాడరూరల్: రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కమిటీ సభ్యులుగా పట్టణానికి చెందిన తాడిపర్తి శ్రీనివాస్, జిల్లా రఘుబాబులను నియమితులయ్యారు. స్థానిక ఆర్యవైశ్య కార్యాలయంలో సోమవారం వీరికి వైశ్య ప్రముఖుడు యెక్కలి మణిదీప్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ్ సత్యనారాయణ నియామకపత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.









బెజవాడలో జోరు వాన

బెజవాడలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైనా మధ్యాహ్న సమయానికి ఒక్కసారి కుండపోతగా వర్షం కురిసింది. సుమారు గంటసేపు జోరు వర్షం పడింది. వర్షపు నీటితో కొన్ని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బెంజిసర్కిల్, బందరు రోడ్డు, బస్టాప్ సెంటర్, నిర్మల కాన్వెంట్ తదితర ప్రదేశాల్లో మోకాలి లోతులో వర్షం నీరు నిలిచింది. వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. కొంతసేపు ట్రాఫిక్ సైతం స్తంభించింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. మొగల్రాజపురం, స్టెల్లా కాలేజీ రోడ్డులో వాహనాలు నిలిచిపోయాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ